

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి తెలుగు

సంచలన తెలుగు దినపత్రిక


రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు ఎడిటర్
9440814576

సంపుటి : 04 సంచిక : 186 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు శుక్రవారం, నవంబరు 06, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram



వైకాపా అక్రమాల్ని అధికారుల దృష్టికి

తీసుకెళ్లండి

కూటమి నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి: పరిషత్తు పోలింగ్ నేపథ్యంలో వైకాపా నేతలు ఎక్కడైనా అక్రమాలకు పాల్పడితే అధికారులకు ఫిర్యాదు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఆ పార్టీ వారు రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తే సంయమనం పాటించాలన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో గురువారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా, పోలింగ్ శాతం తగ్గకుండా చూడాలని సూచించారు.

..2లో

తిరుమల లడ్డూ కేసు బదిలీకి

సుప్రీంకోర్టు నిరాకరణ

దాడులు.. పెట్రోలు బాంబులు

వైఎస్సార్ కడప జిల్లా పల్లెల్లో ఉద్రిక్తత

- అనంతలో బ్యాలట్ పెట్టెను ఎత్తుకెళ్లి ధ్వంసం
- కర్నూలు జిల్లాలో తెదేపా-భాజపా వర్గీయుల మధ్య దాడులు
- ఏలూరు జిల్లాలో తెదేపా కార్యకర్తపై కత్తితో దాడి



పరిషత్ ఎన్నికలు కొన్ని జిల్లాల్లో రణరంగాన్ని తలపించాయి. పదవులతో ముడిపడిన పరువు, ప్రతిష్ఠ కోసం తలలు పగలగొట్టుకునేవరకు వెళ్లారు. పెట్రోలు బాంబులు విసురుకున్నారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో రాజకీయ వేడి హింసాత్మక ఘటనలకు దారితీసింది. పులివెందుల మండలం ఎర్రిపల్లె కేంద్రంలోనికి వెళ్లేందుకు వైకాపా కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వైకాపా నేతలు పెట్రోల్ బాంబుల దాడికి దిగారు. లింగాల మండలంలోని పలు గ్రామాల్లోకి వెళ్లేందుకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రయత్నించగా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు.ఆర్.తుమ్మలపల్లి వద్ద ఇరువర్గాల నాయకులు పెట్రోలు బాంబులు విసురుకున్నారు. పులివెందుల మండలం నల్లపరెడ్డిపల్లెలో తెదేపా నాయకుల కార్లపై వైకాపా కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారు. నందలూరులోనూ ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. కలసపాడు, ఒంటిమిట్ట, సాలాబాదు పోలింగ్ కేంద్రాల వద్ద తెదేపా, వైకాపా వర్గాలు ఘర్షణపడ్డాయి.



పెద్దముడియంలో వైకాపా ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి వర్గీయులు చెలరేగిపోయారు. గుండ్లకుంట, పెద్దపసుపుల, పెద్దముడియం పోలింగ్ కేంద్రాల వద్ద తెదేపా కార్యకర్తలపై దాడులకు దిగారు. రామసుబ్బారెడ్డి దంపతులు ఎన్నికల అధికారులు, పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. గోపవరం మండలం ఎస్.రామపురం పోలింగ్ కేంద్రంలోకి వైకాపా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తనయుడు ఆదిత్యరెడ్డి, వైకాపా నేత నర్సారెడ్డి వెళ్లి బ్యాలట్ బాక్సులో ఇంకు

..2వ పేజీలో











అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే

డెడ్‌లైన్ మొదలు..!!

సుప్రీం కోర్టు స్పష్టత

అదుపులోకి తీసుకున్న వ్యక్తులను న్యాయస్థానాల ముందు హాజరుపరిచేందుకు రాజ్యాంగం విధించిన 24 గంటల గడువుపై సుప్రీం కోర్టు స్పష్టతనిచ్చింది. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే ఈ 24 గంటల డెడ్‌లైన్ ప్రారంభమవుతుందని తేల్చిచెప్పింది. అంతేకానీ ఆ వ్యక్తిని అధికారికంగా అరెస్ట్ చేసిన సమయం నుంచి గడువును లెక్కించకూడదని వివరించింది. 'అధికారికంగా అరెస్ట్ జరిగినప్పటి నుంచే 24 గంటల గడువు మొదలవుతుందని భావించటం తగదు. భారతీయ న్యాయసంహిత ప్రకారం అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే డైడ్‌లైన్‌ను లెక్కించాలి. ఇది పూర్తయ్యేలోపు కచ్చితంగా అరెస్ట్ అయిన వ్యక్తిని కోర్టు ముందు హాజరుపరచాలి' అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. కాగా 24 గంటల గడువు విషయంలో ఒరిస్సా, మద్రాస్, కేరళ హైకోర్టుల గత తీర్పులను సుప్రీం తప్పుబట్టింది. అధికారికంగా అరెస్ట్ జరిగిన క్షణం నుంచే డెడ్‌లైన్ ప్రారంభవుతుందని ఆ హైకోర్టులు మునుపు అభిప్రాయ పడ్డాయి. ఈ అభిప్రాయాలను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. కాగా సుజిత్‌దాస్ వర్సెస్

పరిషత్ పోలింగ్ 67.24%

అల్లూరి జిల్లాలో అత్యల్పం.. శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధికం

ఉదయం మందకొడిగా.. మధ్యాహ్నం భారీగా ఓటింగ్

అక్కడక్కడా ఉద్రిక్తతలు.. ఘర్షణలు

7,767 ఎంపీటీసీ, 582 జడ్పీటీసీ స్థానాల్లో ముగిసిన పోలింగ్

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం సుజనకోట కేంద్రానికి చేరుకునేందుకు గిరిజనులు నాటు పడవలపై ప్రయాణించారు. సుజనకోట పంచాయతీలోని 9 గ్రామాల గిరిజనులు కుమ్మరిపుట్టు వద్ద మత్స్యగెడ్డపై నాటుపడవ ఎక్కి.. అవతల ఒడ్డుకు చేరుకున్నారు. అనంతరం 4 కి.మీ. కాలినడకన వెళ్లి ఓట్లేశారు.

డీఎస్సీలో కనీస అర్హత మార్కులు రావాల్సిందే..!!

రాతపరీక్ష, టెట్ కలిపాక ఓసీలకు 40%, బీసీలకు 35%, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 30%

క్రీడా కోటా పోస్టులకూ వర్తింపు

ఉద్యోగాల ప్రాధాన్య ఎంపికకు రెండు సార్లు అవకాశం

ప్రత్యేక ఉపాధ్యాయులకు ఏడాదికి 0.5 మార్కుల చొప్పున వెయిటేజీ

క్రీడా కోటాలో దరఖాస్తుకు ముందు శాప్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు

అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలకు నిర్వహిస్తున్న డీఎస్సీ-2026లో పాఠశాల విద్యాశాఖ పలు మార్పులు చేసింది. కనీస అర్హత మార్కుల నిబంధనను తెచ్చింది. క్రీడా కోటా అభ్యర్థులు సైతం డీఎస్సీ రాయడంతో పాటు కనీస మార్కులు సాధించాలని నిర్దేశించింది. రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 ప్రకారం 95% పోస్టులు స్థానిక అభ్యర్థులకు, మిగిలిన 5% ఓపెన్ కాంపిటీషన్ కింద ఉంటాయి. ఈ 5% పోస్టులను స్థానిక, స్థానికేతర అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా ఇస్తారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, టీజీటీ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్షకు 80 మార్కులు, టెట్‌కు 20 మార్కుల వెయిటేజీ ఉంటుంది. ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపల్, పీజీటీ, పీడీ, పీఈటీ పోస్టులకు 100 మార్కులకు రాతపరీక్ష ఉంటుంది. వీటికి టెట్ అర్హత అవసరం లేదు. లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 2017 నుంచి నిర్వహించిన సంబంధిత భాషా ప్రత్యేక టెట్ మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు. అంతకుముందు నిర్వహించిన ఉమ్మడి టెట్ మార్కులను పరిగణించరు.

కేటగిరీల వారీగా కనీస మార్కులు... కొత్త నిబంధనల ప్రకారం ఓసీ అభ్యర్థులు 40% కనీస అర్హత మార్కులు సాధించాలి. ఎస్ఏ, ఎస్జీటీ, టీజీటీ, ప్రత్యేక విద్య పోస్టులకు రాతపరీక్ష(80), టెట్ వెయిటేజీ(20) కలిపిన తర్వాత ఓసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ వారికి 40%, బీసీలకు 35%, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 30% కనీస మార్కులు రావాలి. ఇంతకంటే తక్కువొస్తే అనర్హులు. పోస్టులు మిగిలిపోయినా అర్హత సాధించని వారికి అవకాశమివ్వరు. క్రీడా కోటాలోనూ కనీస మార్కులు సాధించిన వారే అర్హులవుతారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపల్, పీజీటీ, పీడీ, పీఈటీ పోస్టులకు రాతపరీక్ష(100) మార్కుల్లో కనీస అర్హత తప్పనిసరి. ఈ కేటగిరీలోనూ క్రీడాకోటా అభ్యర్థులకు కనీస మార్కుల నిబంధన వర్తిస్తుంది.

ప్రత్యేక టీచర్ల సర్వీసుకు వెయిటేజీ... ఐఈఆర్‌టీ, ఐఈడీఎస్ఎస్, తితిదే సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కేజీబీవీ పాఠశాలల్లో ప్రత్యేక ఉపాధ్యాయులుగా పనిచేసిన వారికి సర్వీసు ఆధారంగా వెయిటేజీ ఇస్తారు. ఒక్కో ఏడాది సర్వీసుకు 0.5 మార్కుల చొప్పున గరిష్ఠంగా 5మార్కులు కేటాయిస్తారు. ఏడాదిలో ఆరు నెలలకు మించి పనిచేస్తే ఒక ఏడాదిగా పరిగణిస్తారు. ఈ వెయిటేజీ కలిపినా మొత్తం మార్కులు 100 దాటకుండా చూస్తారు. డీఎస్సీలో కనీస అర్హత మార్కులు సాధించిన వారికే ఈ వెయిటేజీ వర్తిస్తుంది.

..2వ పేజీలో

పోలవరం ప్రాజెక్టు పూర్తికి..

గడువు పెంపు?

2027 మార్చి నెలాఖరు వరకు ప్రస్తుత పరిమితి

మరో 3 నెలలు అదనపు సమయం అవసరమా?

వాస్తవ పరిస్థితులపై అధ్యయనానికి ఐదుగురితో కమిటీ

2027-28 ఆర్థిక సంవత్సరంలో నిధుల ఖర్చుకు కేంద్రం అనుమతి ముఖ్యం

తదనుగుణంగా అథారిటీ అడుగులు..



అమరావతి: పోలవరం తొలిదశ కచ్చితంగా ఎప్పుడు పూర్తి అవుతుందో తేల్చి చెప్పేందుకే ఆ ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. వీలైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని ఆ కమిటీని కోరింది. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి, డిజైన్ల ఆమోదం, ఏ విభాగంలో పని పరిమాణం ఎంతుంది? 2027 మార్చి నెల దాటి ఇంకా ఎంతకాలం సమయం పడుతుంది? అన్న అంశాలను కమిటీ అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఆ నివేదిక ఆధారంగా పోలవరం పనుల గడువు పెంచేలా కేంద్రజల్‌శక్తిశాఖ అనుమతి కోసం అథారిటీ లేఖ రాయాలి. ఆ అనుమతి ఉంటేనే 2027-28 ఆర్థిక సంవత్సరంలోనూ కేంద్రం ఇచ్చే నిధులు ఖర్చు చేసేందుకు వీలు

..2వ పేజీలో

అమరావతి వెలుగు
పంచలను తెలుగు దినపత్రిక

శుక్రవారం
నవంబరు 06, 2026

దాడులు.. పెట్రోలు బాంబులు

(మొదటిపేజీ తరువాయి) పోశారు. గార మండలం శాలిహుండంలో వైకాపా, తెదేపా నేతలు కర్రలు, రాళ్లతో ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు. హిరమండలంలోని కొండరాగోలులో తెదేపా ఏజెంట్‌పై వైకాపా ఏజెంట్లు పిడిగుద్దులు కురిపించారు. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలోని కీసర పోలింగ్ కేంద్రం సమీపంలో వైకాపా, తెదేపా వర్గీయుల మధ్య మూడుసార్లు కొట్లాట చోటుచేసుకుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా ముప్పాళ్ల మండలం లంకెలకూరపాడులో బుధవారం అర్ధరాత్రి తెదేపా నాయకులు మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కె.రవీంద్రారెడ్డిపై వైకాపా నాయకులు దాడి చేశారు. ఓటర్లకు వైకాపా నేతలు మద్యం పంపిణీ చేస్తుండగా.. అటువైపు వెళ్లిన తెదేపా నాయకులపై దాడి చేశారు. దాడిచేసిన వైకాపా నాయకుడే గురువారం పోలింగ్ కేంద్రంలో ఏజెంట్‌గా ఉండి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించడంతో అతనిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో పోలింగ్ తర్వాత తెదేపా వర్గీయులు వైకాపా కార్యకర్తలపై దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కుంచావారిపాలెం పోలింగ్ బూత్‌లో వెబ్‌కాస్టింగ్, ల్యాప్‌టాప్‌ను తెదేపా శ్రేణులు ధ్వంసం చేశాయి.

ఎర్రిపల్లెలో ప్లాస్టిక్ కవర్‌లో పెట్రోలు బాంబులు ... అధికారుల కాలర్లు పట్టుకుని.. అనంతపురం జిల్లా కూడేరు మండలం మరుట్ల-2 గ్రామంలో తెదేపా మద్దతుదారులు దొంగ ఓట్లు వేస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం 11:20 గంటలకు వైకాపా శ్రేణులు పోలింగ్ కేంద్రంలోకి చొరబడ్డాయి. ఏపీవో, ఓపీవోలపై దాడికి తెగబడ్డారు. బ్యాలట్ పెట్టెను బయటకు తీసుకెళ్లి, రాళ్లతో ధ్వంసం చేసి, అందులోని బ్యాలట్ పత్రాలను చెల్లాచెదురుగా పడేశారు. ఈ వ్యవహారంలో ఎర్రిస్వామి, ప్రదీప్, విజయ్, హరి తదితర 60 మందిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు



నమోదుచేసినట్లు సీఐ రాజు తెలిపారు. మరోవైపు రెండు కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలంటూ వైకాపా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తనయుడు ప్రణయ్‌రెడ్డి ప్రదర్శనగా దూసుకొచ్చారు. పోలీసులు అడ్డగించడానికి ప్రయత్నిస్తే వారిని తోసేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కుందుర్పి మండలం బెస్తరపల్లిలో గురువారం ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుపై స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు దాడులు చేసేందుకు యత్నించారు. ఎమ్మెల్యే ప్రైవేటు అంగరక్షకుడిపై దాడి చేసి గాయపరిచారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైకాపా నాయకుడు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిని పోలీసులు గృహనిర్బంధంలోకి తీసుకునే క్రమంలో తెదేపా, పోలీసులను ఉద్దేశిస్తూ రెచ్చిపోయారు. 'అమ్మతోడు.. చెబుతున్నా అక్కడ కచ్చితంగా ఖానీలు జరుగుతాయ్.. మేము ఖానీలు చేయాల్సి వస్తాది' అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇష్టారాజ్యంగా రిగ్గింగ్: కర్నూలు జిల్లా కోసిగి మండలం ఆర్లబండలోని 2/2 పోలింగ్ కేంద్రంలోకి గురువారం మధ్యాహ్నం 60 మంది గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రిగ్గింగ్ చేశారు. దీనిపై తెదేపా, వైకాపా నాయకులు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. రిటర్నింగ్ అధికారి ఆ పోలింగ్ కేంద్రంలో ఎన్నికలను నిలిపివేశారు. చిప్పగిరి మండలం గుమ్మనూరులో పరిషత్ ఎన్నికల సందర్భంగా మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు వరుసకు సోదరుడయ్యే గుమ్మనూరు నారాయణ, తెదేపాకు చెందిన హంపయ్యల మధ్య పాతకక్షలు భగ్గుమన్నాయి. వైకాపా ఏజెంటు గుమ్మనూరు పోలింగ్ కేంద్రం దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ప్రస్తుతం భాజపాలో ఉన్న నారాయణ ఆయన్ను ప్రశ్నించారు. దీంతో హంపయ్య, ఆయన వర్గీయులు నారాయణతో వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాలవారు కళ్లలో కారాలు కొట్టుకుని, కర్రలతో దాడి చేసుకున్నారు.

అనంతపురం జిల్లా మరుట్ల-2 గ్రామంలో పడేసిన బ్యాలట్ పత్రాలు.. ఏలూరు జిల్లా నూజివీడు మండలం తూర్పు దిగవల్లిలో తెదేపా కార్యకర్త రొంపిచర్ల సీతయ్యపై వైకాపా కార్యకర్త తూమేటి వరుణ్‌తేజ, అతని తండ్రి రత్నారావు కలిసి కీచైన్‌కు ఉన్న కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. సీతయ్య మెడకు తీవ్ర గాయమైంది.

ఎమ్మెల్యేపై దాడికి యత్నం: శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ స్వగ్రామం క్రిష్ణప్పపేటలో శంకర్ అరగంటపాటు క్యూలో ఉన్నారు. ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఆరోపిస్తూ వైకాపా నేత పోలింగ్ బూత్ అధికారికి ఫిర్యాదుచేశారు. దీంతో అక్కడే ఉన్న తెదేపా, వైకాపా నేతల మధ్య వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యే శంకర్, ఆయన తండ్రి జగపతి ఓటువేసి బయటకొస్తుండగా ఎంపీటీసీ అభ్యర్థి భర్త ఎచ్చెర్ల శ్రీధర్, నరసింగరావు ఒక్కసారిగా ఎమ్మెల్యేను తోసేందు

అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే
డెడ్‌లైన్ మొదలు..!!

(మొదటిపేజీ తరువాయి) యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణలో భాగంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. మాదకద్రవ్యాల రవాణా కేసులో త్రిపురలో గతేడాది సెప్టెంబర్ 29 మధ్యాహ్న సమయంలో సుజిత్‌దాస్ అనే వ్యక్తి అరెస్ట్ అయ్యాడు. అయితే అక్కడి పోలీసులు సెప్టెంబర్ 30న అతడి అరెస్టును అధికారికంగా నమోదు చేశారు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు కోర్టు ముందు సుజిత్‌ను హాజరుపరిచారు. దీన్ని నిందితుడి తరపు న్యాయవాదులు తప్పుబట్టారు. కావాలనే పోలీసులు అరెస్ట్ సమయాన్ని తప్పుగా చూపిస్తున్నారని వారు వాదించారు. మరోవైపు అరెస్ట్ చేసినప్పుడే 24 గంటల డైడ్‌లైన్ వర్తిస్తుందని దర్యాప్తు సంస్థలు ప్రతి వాదనలు చేశాయి. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు గడువుపై స్పష్టతనిచ్చింది.

తిరుమల లడ్డూ కేసు బదిలీకి సుప్రీంకోర్టు నిరాకరణ

దిల్లీ: తిరుమల లడ్డూ కల్తీ కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీచేయాలని కోరుతూ ఆ కేసులో నిందితుడిగా ఉన్న మాల్‌గంగ మిల్క్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ మచీంద్ర శాంతారాం లంకే దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. గురువారం దీనిపై విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనల ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపిస్తూ ఈ కేసు విషయంలో రాజకీయ నాయకుల వ్యాఖ్యానాలు స్వేచ్ఛాయుత విచారణకు ప్రతికూల వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. "ఈ కేసు రాజకీయాంశంగా మారింది. ఇందులో జంతుకొవ్వు కలవలేదని ఫోరెన్సిక్ నివేదిక చెబుతున్నా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కూడా దీనిపై మాట్లాడారు. దిగువ కోర్టు న్యాయమూర్తి ఈ వ్యాఖ్యల ప్రభావానికి లోను కాకపోయినా ప్రస్తుతం ఉన్న వాతావరణంలో నిష్పాక్షిక విచారణను ఆశించలేం. అందువల్ల దీని విచారణను పొరుగు రాష్ట్రానికి బదిలీచేయాలని కోరుతున్నాం. ఈ అంశంపై నాయకుల ప్రకటనలను కోర్టు పరిశీలించాలి. ఇలాంటి వాతావరణంలో విచారణ కొనసాగితే ఇబ్బంది పడేది నేనే. నాయకుల మధ్య యుద్ధంలో నన్ను ఉపయోగించుకుంటున్నారు. ఇది సీబీఐ ఆధ్వర్యంలో నడుస్తున్న కేసు. నిందితుల్లో చాలామంది ఉత్తర భారతీయులు. వారికి అక్కడ భాషాపరమైన సమస్యలూ ఉంటాయి" అని పేర్కొన్నారు. ఆ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. విచారణ బదిలీకి ప్రాతిపదికేమీ లేదని, అందువల్ల డిస్మిస్ చేస్తున్నామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రకటించారు. ఇదివరకు జారీచేసిన ఉత్తర్వుల ద్వారా నాయకులందరినీ మాట్లాడకుండా చేశామని, ఏదైనా జరిగితే ఇక్కడికి రావొచ్చని పేర్కొంటూ విచారణ ముగించారు.

పోలవరం ప్రాజెక్టు పూర్తికి గడువు పెంపు?

ఉంటుంది. ఈ మేరకు పీపీఏ సీఈవో ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కమిటీలో పీపీఏ సభ్య కార్యదర్శి, పోలవరం అథారిటీ చీఫ్ ఇంజినీరు (ప్లానింగు, డిజైన్), రాష్ట్ర జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్, వ్యాప్కోస్ జనరల్ మేనేజర్, పునరావాస కమిషనర్‌లను సభ్యులుగా నియమించారు. కిందటి నెలలో కేంద్రజల్‌శక్తి కార్యదర్శి పోలవరంపై సమీక్షించిన సందర్భంలోనూ ఈ అంశం చర్చకు వచ్చింది.

ఎందుకీ కమిటీ?... పోలవరం ప్రాజెక్టు తొలిదశకు కేంద్రం రూ.30,436.95 కోట్లతో అంచనాలను 2024 జూన్ తర్వాత సవరించింది. ఈ ప్రాజెక్టులో ం41.15 మీటర్ల ఎత్తులో నీరు నిలిపేందుకు వీలుగా ఈ నిధులు మంజూరు చేసింది. అప్పటి వరకు ఇచ్చిన నిధులు పోను రూ.12,157.53 కోట్లు ఇచ్చేందుకు, అదీ అడ్వాన్సుగా అందజేసేందుకు కేంద్రం అనుమతించింది. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్రం తీసుకున్న కీలక నిర్ణయం ఇది. కేంద్ర మంత్రి మండలి ఈ నిధులు ఇచ్చేందుకు అనుమతిస్తూ ప్రాజెక్టు తొలిదశను 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని గడువు విధించింది. ఒక వేళ అలస్యమైతే ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని షరతు విధించింది. 2026 మార్చి ఆఖరుకు పూర్తయ్యే పరిస్థితులు లేకపోవడంతో 2027 మార్చి 31 నాటికి పూర్తి చేయాలంటూ ఈ ఏడాది మార్చిలో కేంద్ర జల్‌శక్తి అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం నిర్మాణం వేగంగా సాగుతున్నా 2027 మార్చి ఆఖరుకు ఎంత వరకు పూర్తవుతుందనేది కాస్త అనుమానమే. 2027 జూన్ నెలాఖరుకు కచ్చితంగా పూర్తి చేయగలమనే నమ్మకం అధికార యంత్రాంగంలో కనిపిస్తోంది. ఇందుకు కేంద్రం నుంచి గడువు పెంపు ఉత్తర్వులు అందుకోవాల్సి ఉంటుంది. అంచనాల సవరణ కమిటీ ఆమోదం, అనుమతి మేరకు 2027 మార్చి 31 వరకే నిధులు ఖర్చు చేసేందుకు అవకాశం ఉంది. తదుపరి ఆర్థిక సంవత్సరంలోకి అంటే 2027-28లో పోలవరంపై ఖర్చు చేయాలంటే కేంద్రం నుంచి ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో తదుపరి ఆర్థిక సంవత్సరంలో పోలవరంపై రూ.981.12 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటుందని అంచనా వేశారు. కేంద్రం నుంచి గడువు పెంపు అనుమతి కోసం లేఖ రాసే క్రమంలో పోలవరం అథారిటీ ఒక కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేయాలని భావించింది. ఈ కమిటీ పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత నిర్మాణ, ఆర్థిక పురోగతిని మదింపు చేయాలి. ప్రధాన డ్యాం నిర్మాణానికి అవసరమైన ఆకృతుల అనుమతులు, పూర్తి చేసేందుకు ఉన్న సాధన సంపత్తి, రక్షణ పనులకు సంబంధించిన అంశాలు పరిశీలించాలి. 2027 మార్చి తర్వాత ఎంత కాలానికి పూర్తి చేయగలరు? అందుకు తగ్గ వనరులు ఉన్నాయా?లేదా? అన్న అంశమూ పరిశీలించాలి. భూసేకరణ, పునరావాస కాలనీల నిర్మాణ వాస్తవ పరిస్థితులు పరిశీలించి, ఎప్పటికి పూర్తి అవుతాయో తేల్చాలి. చేయబోయే పనులన్నీ రూ.30,436.95 కోట్ల పరిధిలోనే ఉండాలి. పోలవరం పనుల గడువు పెంపు కోరుతూ కేంద్రజల్‌శక్తికి నివేదించేందుకు వీలుగా ఈ నివేదిక ఉండాలి.

డీఎస్సీలో కనీస అర్హత మార్కులు రావాల్సిందే

ప్రాధాన్య ఐచ్ఛికాలు మార్చుకోవచ్చు... అభ్యర్థులు తమ అర్హతలను బట్టి ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలోనే పోస్టులు, యాజమాన్యాల వారీగా ప్రాధాన్య క్రమాన్ని తప్పనిసరిగా పేర్కొనాలి. ఆ తర్వాత ప్రాధాన్య ఐచ్ఛికాలను మార్చుకోవడానికి మెరిట్ జాబితా ప్రకటించాక వారం రోజుల గడువిస్తారు. గత డీఎస్సీలో దరఖాస్తు సమయంలోనే పోస్టుల ప్రాధాన్య ఐచ్ఛికాల నమోదుకు అవకాశమిచ్చారు. ఆ తర్వాత ఎడిట్ ఆప్షన్ లేక కొందరు అభ్యర్థులు ఉన్నత పోస్టులకు ఎంపికైనా ప్రాధాన్య ఐచ్ఛికం ఇవ్వనందున అవకాశాన్ని కోల్పోయారు. దీనిపై అప్పట్లో ఫిర్యాదులు వచ్చినందున.. ఈసారి మార్పు చేశారు.

క్రీడా కోటాకు ప్రత్యేక నిబంధనలు... క్రీడల కోటాలో దరఖాస్తు చేసేవారు ముందుగా ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) క్రీడా యాప్/పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అక్కడ ఇచ్చే రిజిస్ట్రేషన్ గుర్తింపు నంబరును డీఎస్సీ దరఖాస్తులో నమోదుచేయాలి. క్రీడా యాప్/పోర్టల్‌తో పాఠశాల విద్యాశాఖ దరఖాస్తు పోర్టల్ అనుసంధానమై ఉంటుంది. యాప్‌లో నమోదుచేసిన క్రీడా సర్టిఫికెట్లలో ఏవైనా మూడు అత్యున్నతమైనవి దరఖాస్తు సమయంలో ఎంచుకోవాలి. యాప్‌లో అప్‌లోడ్ చేసిన అన్ని సర్టిఫికెట్లను జెన్యూనిటీ కోసం ఆయా సంఘాలు, సమాఖ్యలకు ఆన్‌లైన్‌లో పంపిస్తారు. ఇప్పటి వరకు క్రీడా కోటాలో 17 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రాతపరీక్షకు హాజరై కనీస అర్హత మార్కులు సాధించడంతో పాటు క్రీడా ప్రాధాన్య క్రమంలోనూ అర్హత ఉండాలి. క్రీడా కోటాలో ఎంపిక కాకపోతే సాధారణ మెరిట్ ప్రకారం పరిగణనలోకి తీసుకుంటారు.

మెరిట్ జాబితా ఇలా.. ప్రతి నియామక యూనిట్, పోస్టు, యాజమాన్యం వారీగా మెరిట్ కమ్ రోస్టర్ జాబితాను రూపొందిస్తారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, జేసీ వైస్‌ఛైర్మన్‌గా ఉండే జిల్లా ఎంపిక కమిటీకి డీఈవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. మెరిట్ జాబితా విడుదలైన ఏడు రోజుల్లో అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. పరిశీలన దశలో అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలను చూపించాలి. లేదంటే అభ్యర్థిత్వం రద్దవుతుంది. నియామకాల్లో వెయిటింగ్ జాబితా ఉండదు. తుది ఎంపిక జాబితా విడుదలయ్యాక అర్హులెవరూ లేకపోవడం, ఎంపికైన వారు విధుల్లో చేరకపోవడం వంటి కారణాలతో మిగిలిపోయే ఖాళీలను తదుపరి నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు. ఎంపికైన వారిని రెగ్యులర్ ప్రాతిపదికన నియమిస్తారు. అప్రెంటిస్ విధానం ఉండదు. నియామక ఉత్తర్వులు అందుకున్న 30 రోజుల్లో విధుల్లో చేరకపోతే ఉద్యోగం కోల్పోతారు.

ప్రిన్సిపల్‌కు అనుభవం తప్పనిసరి ... సొసైటీలు, సంక్షేమ శాఖల్లోని విద్యాసంస్థల్లో ప్రిన్సిపల్ పోస్టులకు విద్యార్హతతో పాటు ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో పనిచేసిన అనుభవం ఉండాలి. గుర్తింపు పొందిన సీనియర్ సెకండరీ పాఠశాలల్లో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌గా కనీసం మూడేళ్లు, సెకండరీ పాఠశాలల్లో గ్రూప్-బీ పోస్టు, పీజీటీ, లెక్చరర్, సెకండరీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడిగా కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. అన్ని పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 2026 జులై 1 నాటికి 44 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 49 ఏళ్లు. దివ్యాంగులకు 54 ఏళ్లు. మాజీ సైనికులకు సైన్యంలో పనిచేసిన కాలానికి అదనంగా మూడేళ్ల మినహాయింపునిస్తారు.

పరీక్ష విధానమిదీ... 80 మార్కులకు నిర్వహించే పరీక్షకు 2.30 గంటలు, వంద మార్కులకు నిర్వహించే పరీక్షకు 3 గంటల వ్యవధి ఉంటుంది. ఎన్ఏ, ఎస్జీటీలకు 80 మార్కులకు 160 ప్రశ్నలు ఇస్తారు. ఎన్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్, పీడీ, పీఈటీ పోస్టులకు 100 మార్కులకు 200 ప్రశ్నలు ఉంటాయి. ప్రిన్సిపల్ పోస్టులకు 100 మార్కులకు ఆంగ్ల భాషా ప్రావీణ్య పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి గంటన్నర. ఇందులో అర్హత తప్పనిసరి. ప్రిన్సిపల్‌కు పేపర్-2 100 మార్కులకు(సీబీటీ) 200 ప్రశ్నలతో పరీక్ష ఉంటుంది. పీజీటీ భాషేతర పోస్టులకు ఆంగ్ల భాషా ప్రావీణ్య పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత తప్పనిసరి. టెట్ అవసరం లేదు. పేపర్-2ను 100 మార్కులకు నిర్వహిస్తారు. టీజీటీ భాషేతర పోస్టులకు ఆంగ్ల భాషా ప్రావీణ్య పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలి. పేపర్-2 రాతపరీక్ష 80 మార్కులకు ఉంటుంది. టీజీటీ ప్రత్యేక విద్య, టీజీటీ భాషా పోస్టులకు ఆంగ్ల భాషా పరీక్ష ఉండదు. 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్షలను కంప్యూటర్ ఆధారితంగా (సీబీటీ) నిర్వహిస్తారు. జేఈఈ, గేట్, క్యాట్, ఆర్ఆర్‌బీ వంటి జాతీయ స్థాయి పరీక్షలకు పాటించే ప్రమాణాలనే అనుసరిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు సమీప రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలుంటాయి. అభ్యర్థుల సంఖ్య ఆధారంగా కేంద్రాలను కేటాయిస్తారు.

సంపాదకీయం

శ్వేతసౌధానికి స్వదేశీ సందేశం

అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాలు అక్కడి కాంగ్రెస్(పార్లమెంటు)లో బలాబలాలతో పాటు వాషింగ్టన్‌లో రాజకీయాల తీరుతెన్నులను మార్చివేశాయి. అధ్యక్షుడు ట్రంప్‌ను బలహీనపరచడంతోపాటు... విదేశాలపై దుందుడుకు యుద్ధాలు చేస్తే స్వదేశంలో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించు కోవాల్సి వస్తుందనే గట్టి హెచ్చరికనూ పంపాయి. ప్రతిపక్ష డెమోక్రాట్లు దిగువసభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్), ఎగువసభ (సెనేట్) రెండింటిలోనూ మెజారిటీ సాధించారు. పాలనలో రిపబ్లికన్ల పూర్తిస్థాయి ఆధిపత్యానికి తెరదించారు. ఈ



ఫలితాల ప్రభావం అంతర్జాతీయంగా ఎలా ఉంటుందన్నది ఆసక్తికరం! అగ్రరాజ్య మధ్యంతర ఎన్నికల్లో పాలక పక్షంపై ఓటర్ల ఆగ్రహానికి తక్షణ కారణం- జీవన వ్యయం పెరగడమే. ఈ ఏడాది ఫిబ్రవరి చివర్లో ప్రారంభమైన ఇరాన్ యుద్ధం ఇంధన ధరలను పెంచింది. పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరల పెరుగుదలతో అమెరికన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెప్టెంబర్‌లో డీజిల్ ధర గాలన్ (దాదాపు 3.8 లీటర్ల)కు 6.50 డాలర్లు దాటగా, జూన్‌లో పెట్రోల్ ధర 5 డాలర్లు దాటింది. యుద్ధం వల్ల సగటు అమెరికన్ కుటుంబంపై దాదాపు 1,230 డాలర్ల అదనపు భారం పడిందని అంచనా. అంతూపొంతూలేని యుద్ధాలకు స్వస్తి పలుకుతానన్న హామీతో అధికారంలోకి వచ్చిన ట్రంప్- అమెరికాను సుదీర్ఘ పోరాటంలోకి నెట్టారు. యుద్ధం వల్ల ఇంధనం, నిత్యావసరాలపై పడిన భారాన్ని అమెరికా ఓటర్లు తీవ్రంగా నిరసించారు. యుద్ధ భారాన్ని మోయలేమని తేల్చిచెప్పారు. పెట్రోల్ ధరలు తమ పార్టీ ఫలితాలను దెబ్బతీశాయని ట్రంప్ అంగీకరించినా, యుద్ధం వ్యూహాత్మకంగా అవసరమని సమర్థించుకున్నారు!

గెలవలేని యుద్ధానికి రాజకీయ మూల్యం... కాంగ్రెస్‌లో డెమోక్రాట్ల విజయం ట్రంప్‌ను అధ్యక్ష పదవి నుంచి దించకపోయినా, ఆయన నిర్ణయాధికార స్వేచ్ఛను పరిమితం చేస్తుంది. ట్రంప్ సర్కారు తెచ్చే చట్టాలను ప్రతిపక్ష డెమోక్రాట్లు కాంగ్రెస్‌లో నిరోధించవచ్చు. పార్లమెంటు కమిటీల ద్వారా ఆయన నిర్ణయాలపై విచారణలు జరపవచ్చు. మరీ ముఖ్యంగా, ఫెడరల్ ప్రభుత్వ ఖర్చులను నియంత్రించే ఆర్థిక అధికారం ఇప్పుడు వారి చేతిలో ఉంది. సెనేట్ కూడా ఉన్నతాధికారులు, న్యాయమూర్తుల నియామకాలను నియంత్రించగలదు. ఇకపై ట్రంప్ తీసుకునే ప్రతి ప్రధాన నిర్ణయం కాంగ్రెస్‌లో తీవ్ర పరిశీలనను ఎదుర్కొంటుంది. అమెరికా మధ్యంతర ఎన్నికలు ఇరాన్ యుద్ధ రాజకీయాన్ని కూడా మారుస్తాయి. యుద్ధం వల్ల గల్ఫ్ చమురు, ద్రవీకృత సహజ వాయువు(ఎల్ఎన్‌జీ) సరఫరాలకు అంతరాయం కలిగింది. చమురు ధరలైతే యుద్ధానికి ముందుకంటే 40శాతం అధికంగా ఉన్నాయి. ఆర్థికంగా నష్టం కలిగిస్తోందనే కారణంతో యుద్ధాన్ని ఒక్కసారిగా నిలిపివేస్తే, పరాజయంగా ముద్రపడే ప్రమాదం ఉంది. కాబట్టి దౌత్య మార్గంలోనే యుద్ధానికి స్వస్తిపలకడం శ్వేతసౌధానికి అవసరంగా మారవచ్చు. అయితే, ఎన్నికల ఫలితాలు ఇజ్రాయెల్‌కు అసౌకర్యంగా మారాయనే చెప్పాలి. ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా నుంచి బలమైన మద్దతును కోరుకుంటున్నారు. ఆ మద్దతు ఇప్పటికిప్పుడు పూర్తిగా అంతరించిపోదు. అమెరికా రాజకీయాల్లో ఇజ్రాయెల్‌కు పాలక, ప్రతిపక్షాల మద్దతు ఇప్పటికీ బలంగానే ఉంది. అయితే యుద్ధ వ్యయం, పౌరులపై భారం, సైనిక సాయం, యుద్ధానికి స్పష్టమైన రాజకీయ ముగింపు లేకపోవడం గురించి ట్రంప్ సర్కారును కాంగ్రెస్ నిలదీయవచ్చు. దీనంతటి నుంచి నేర్చుకోవాల్సిన పెద్ద పాఠం: 'సైనిక బలం శత్రు స్థావరాలను, మౌలిక వసతులను ధ్వంసం చేయగలదు కానీ, ఆశించిన రాజకీయ ఫలితాలను ఇవ్వలేకపోవచ్చు'. అమెరికా, ఇజ్రాయెల్‌లు కలిసి ఇరాన్ సైనిక వసతులను దెబ్బతీసినా, టెహ్రాన్‌లో తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయాయి. దానికి సంబంధించిన రాజకీయ మూల్యాన్ని తమ దేశ ఎన్నికల్లో అమెరికా, ఇజ్రాయెల్ ప్రభుత్వాలు చెల్లించాయి. యుద్ధం వల్ల రెండు దేశాల పౌరులపైనా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా భారం పెరిగింది. 2025లో 3.5శాతంగా ఉన్న ప్రపంచ వృద్ధిరేటు 2026లో 3.1శాతానికి కుదించుకుపోతుందని 'ఐఎంఎఫ్' అంచనా వేసింది. హర్ముజ్ జలసంధి మూసివేతతో ఇంధన సరఫరాలకు ఏర్పడిన అంతరాయం వృద్ధిని తగ్గించింది. ఇంధనాన్ని దిగుమతి చేసుకునే వర్ధమాన దేశాలు పెరిగిన దిగుమతి బిల్లులతో, బలహీనపడుతున్న కరెన్సీలతో తీవ్రంగా సతమతమవుతున్నాయి. భారతదేశంపైనా ఈ ప్రభావం ప్రత్యక్షంగా కనిపిస్తోంది. గల్ఫ్‌లోని సంఘర్షణ ఇండియాలో ఇంధన ధరలనూ, రవాణా ఖర్చులనూ, ద్రవ్యోల్బణాన్నీ పెంచేసింది. అందుకే గల్ఫ్‌లో ఉద్రిక్తతలు తగ్గి చమురు, గ్యాస్ సరఫరాల పునరుద్ధరణ జరగాలని భారత్ ఆశిస్తోంది. అయితే, వేర్వేరు ప్రాంతాల నుంచి ఇంధన వనరులను దిగుమతి చేసుకోవడమూ చాలా ముఖ్యం.

మారిన ప్రపంచ క్రమం... మధ్యంతర ఎన్నికల ఫలితాల అర్థం- అమెరికా ప్రపంచ పెత్తనం నుంచి వెనక్కి తగ్గుతుందని కాదు. అగ్రరాజ్య అధికారం స్వదేశంలో మరింత సవాలుకు గురవుతుందని మాత్రమే. ఇక నుంచి ప్రభుత్వ నిర్ణయాలకు కాంగ్రెస్ వివరణలు కోరుతుంది. యుద్ధాలకు ఎంత ఖర్చవుతుందో ఓటర్లు ప్రశ్నిస్తారు. అమెరికా ప్రభుత్వమిచ్చే హామీలు స్వదేశీ రాజకీయాలను తట్టుకుని నిలబడగలవా అని మిత్రదేశాలు ఆలోచిస్తాయి. అదేమీ చెడు కాకపోవచ్చు. ప్రజాస్వామ్య జవాబుదారీతనం విచక్షణారహిత చర్యలకు ముకుతాడు వేస్తుంది. అయితే, అది అమెరికా విధానాలను తక్కువ అంచనా వేసేలా చేయవచ్చు. మిత్రదేశాలు ప్రత్యామ్నాయాలు చూసుకోవచ్చు. ప్రత్యర్థులు అమెరికా పరిమితులను పరీక్షించవచ్చు. మార్కెట్లు మరింత అనిశ్చితికి గురికావచ్చు. కేవలం సైనిక బలం మాత్రమే రాజకీయ అధిక్యతను ఇవ్వని యుగంలోకి ప్రపంచం ఇప్పుడు అడుగుపెడుతోంది. విమానవాహక యుద్ధ నౌకలు, కచ్చితత్వంతో కూడిన అత్యాధునిక ఆయుధాలతోపాటు ప్రజలకు ఆర్థిక భద్రత, ఇంధన స్థిరత్వం, సర్కారీ విధానాలకు స్వదేశీ సమ్మతి కూడా చాలా ముఖ్యమని గ్రహించాలి. ట్రంప్ తన మిత్రపక్షాలతో కలిసి ఇరాన్ భవిష్యత్తును రూపుదిద్దడానికి బయలుదేరారు. కానీ ఆ యుద్ధం అమెరికా రాజకీయాన్ని పునర్నిర్మించింది. విదేశాల్లో ఏమి ధ్వంసం చేశారనే దానికన్నా, స్వదేశంలో ఎంత మూల్యం చెల్లిస్తున్నామనే దాంతోనే ఓటర్లు నాయకులను అంచనా వేస్తారని మధ్యంతర ఎన్నికలు శ్వేతసౌధానికి గుర్తుచేశాయి.

పరిషత్ పోలింగ్ 67.24%

అమరావతి: అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు, స్వల్ప ఘర్షణలు, కొట్లాటలు, ఉద్రిక్తతలు మినహా రాష్ట్రవ్యాప్తంగా గురువారం పరిషత్ ఎన్నికల పోలింగ్ సాఫీగా సాగింది. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఆ సమయానికి పోల

జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా
ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు

పుట్టపర్తి, నవంబరు 05, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. ఎక్కడా ఎలాంటి







అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియను ఎస్పీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పోలీసు అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధర్మవరంలో అత్యధికం.. గోరంట్లలో అత్యల్పం

శ్రీసత్యసాయి జిల్లా, నవంబరు 05, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో 82.40 శాతం పోలింగ్ నమోదైంది.



మండలాల వారీగా పోలింగ్ శాతాలను పరిశీలిస్తే ధర్మవరం మండలం 91.45 శాతంతో జిల్లాలోనే అత్యధిక పోలింగ్ నమోదుచేసి ప్రథమ స్థానంలో నిలిచింది. పెనుకొండ మండలం 91.44 శాతంతో రెండో స్థానంలో నిలవగా, పుట్టపర్తి మండలంలో 90.50 శాతం పోలింగ్ నమోదైంది. మరోవైపు గోరంట్ల మండలంలో అత్యల్పంగా 75.53 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం 32 జెడ్పీటీసీ, 377 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 11,35,917 మంది ఓటర్లకు గాను 9,35,970 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో జిల్లా సగటు పోలింగ్ 82.40 శాతంగా నమోదైంది.

మండలాల వారీగా పోలింగ్ శాతం ఇలా.. ధర్మవరం 91.45, పెనుకొండ 91.44, పుట్టపర్తి 90.50, నల్లచెరువు 88.86, గండ్లపెంట 87.89, రొళ్ల 87.70, అగళి 87.45, అమడగూరు 85.66, గుడిబండ 85.56, సోమందేపల్లి 85.18, తాడిమర్రి 84.68, మడకశిర 84.66, హిందూపురం 84.24, బుక్కపట్నం 84.00, రొద్దం 83.40, తలుపుల 83.23, చిలమత్తూరు 82.66, కనగానపల్లి 82.52, బత్తలపల్లి 80.82, ఓడిచెరువు 80.45, కదిరి 80.31, అమరాపురం 79.95, పరిగి 79.76, చెన్నేకొత్తపల్లి 79.46, ఎన్.పి.కుంట 78.83, నల్లమాడ 78.77, రామగిరి 77.15, తనకల్లు 75.98, ముదిగుబ్బ 75.57, గోరంట్ల 75.53 శాతం పోలింగ్ నమోదైంది.

శాంతియుత ఎన్నికల నిర్వహణపై ఎమ్మెల్యే కందికుంటకు
నియోజకవర్గ ప్రజల కృతజ్ఞతలు

కదిరి, నవంబరు 05, అమరావతి వెలుగు : కదిరి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలతో పాటు గురువారం నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు



ప్రశాంత వాతావరణంలో జరగడంపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన నల్లచెరువు జెడ్పీటీసీ ఎన్నికలోనూ ప్రజాస్వామ్యబద్ధంగా పోలింగ్ ప్రక్రియ కొనసాగడం చర్చనీయాంశంగా మారింది. నల్లచెరువు జెడ్పీటీసీ స్థానంలో పరిటాల శ్రీరామ్ పోటీలో ఉన్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా సహకరించారని ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు, నాయకులు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకునే వాతావరణం ఉండటం అభినందనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఎన్నికల విధుల్లో విషాదం.. గుండెపోటుతో ఏపీవో మృతి

అనంతపురం, నవంబరు05, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఏపీవో హరిత గౌడ్



గుండెపోటుతో మృతి చెందారు. కూడేరు మండలం కడదరకుంటలో గురువారం ఈ ఘటన జరిగింది. రాయదుర్గంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న హరిత గౌడ్ ఎన్నికల విధుల్లో భాగంగా కడదరకుంటలో ఏపీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో ఉండగానే అకస్మాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. వెంటనే అప్రమత్తమైన తోటి సిబ్బంది, పోలీసులు ఆమెను ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే ఆమె ప్రాణాలు విడిచారు. ఎన్నికల విధుల్లో ఉండగా హరిత గౌడ్ మృతి చెందడం తోటి ఉద్యోగులు, సిబ్బందిని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఆమె మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన...
జిల్లా ఎన్నికల పరిశీలకులు అరుణ్ బాబు






కొత్తచెరువు, నవంబరు 5, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా ఎన్నికల పరిశీలకులు పి. అరుణ్ బాబు కొత్తచెరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బందికి అందుబాటులో ఉన్న వసతులపై ఆరా తీశారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంత



వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డిఓ కుమారి సువర్ణ, ఎన్నికల అధికారి ఈ.జయంతి, ఎంపీడీవో నటరాజ్, డిప్యూటీ తహసిల్దార్ కళ్యాణ్ కుమార్ ఉన్నారు.

దివ్యాంగురాలిని వీల్‌చైర్‌లో తీసుకెళ్లి
ఓటు వేయించిన సీఐ రాజశేఖర్

కొత్తచెరువు, నవంబరు5, అమరావతి వెలుగు : విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించే పోలీసుల్లో మానవత్వం, సేవాభావం కూడా అంతర్లీనంగా ఉంటాయని కొత్తచెరువు అప్‌గ్రేడ్ సర్కిల్








ఇన్‌స్పెక్టర్ కె. రాజశేఖర్ నిరూపించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ఓ దివ్యాంగురాలికి స్వయంగా సహాయం చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన దివ్యాంగురాలు నడవలేని పరిస్థితిని గమనించిన సీఐ రాజశేఖర్ వెంటనే స్పందించారు. ఆమెను వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి స్వయంగా పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లారు. ఓటు వేసేందుకు అవసరమైన సహాయాన్ని అందించి, ఆమె తన ఓటు హక్కును వినియోగించుకునేలా తోడ్పడ్డారు. కేవలం భద్రతా విధులకే పరిమితం కాకుండా, ప్రజల ఇబ్బందులను గుర్తించి మానవీయ దృక్పథంతో స్పందించడం ఆయన సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది. సాధారణంగా పోలీసు అధికారులు అంటే శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, బందోబస్తు విధులు గుర్తుకు వస్తాయి. అయితే ప్రజలకు ఆపదలో అండగా నిలవడం, అవసరమైన సమయంలో ఆపన్నహస్తం అందించడం కూడా పోలీసు విధుల్లో భాగమేనని సీఐ రాజశేఖర్ తన చర్యతో చాటిచెప్పారు. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు సమానమేనని, దివ్యాంగులు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలన్న స్ఫూర్తిని ఆయన చర్య ప్రతిబింబించింది. ఎన్నికల బందోబస్తులో తీరికలేకుండా విధులు నిర్వహిస్తూనే ఓ దివ్యాంగురాలికి స్వయంగా సహాయం చేయడం స్థానికులను ఆకట్టుకుంది. సీఐ రాజశేఖర్ చూపిన మానవత్వం, సేవాగుణంపై కొత్తచెరువు మండల ప్రజలు ప్రశంసలు కురిపించారు. పోలీసు యూనిఫాం వెనుక ఉన్న మానవీయ కోణాన్ని చాటిచెప్పిన ఈ ఘటన పలువురికి స్ఫూర్తిగా నిలిచింది.

మేయర్ రమేష్ గౌడ్‌కు ఈడిగ కుల పెద్దల సన్మానం

అనంతపురం, అమరావతి వెలుగు : అనంతపురం నగరపాలక సంస్థ మేయర్‌గా ఎన్నికైన చిట్లూరు రమేష్ గౌడ్‌ను ఈడిగ కులస్తుల పెద్దలు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదినారాయణ, ఈశ్వరయ్య, శ్రీనివాస్ బాబు, సురేష్, రామ్ గౌడ్, మురళి, ముఖేష్, మధు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ అనంతపురం నగర ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ నగర ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. మేయర్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయనను సన్మానించడం ఆనందంగా ఉందని ఈడిగ కుల పెద్దలు తెలిపారు. నగర అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని, రమేష్ గౌడ్ నాయకత్వంలో అనంతపురం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్..
64.38 శాతం ఓటింగ్

అనంతపురం, నవంబరు 5, అమరావతి వెలుగు : జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా కేంద్రంలోని నియంత్రణ కేంద్రం నుంచి పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షించారు. సీసీటీవీ దృశ్యాల ద్వారా పోలింగ్ కేంద్రాల పరిస్థితులను పరిశీలిస్తూ, ఎక్కడైనా ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. సున్నితమైన, అత్యంత సున్నితమైన కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. 320 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ సదుపాయం కల్పించి ఎన్నికల సరళిని పర్యవేక్షించారు. ప్రసార మాధ్యమాల ద్వారా అందిన సమాచారాన్ని కూడా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ ప్రక్రియ ముగిసింది.



64.38 శాతం పోలింగ్ నమోదు... జిల్లాలో మొత్తం 12,44,920 మంది ఓటర్లు ఉండగా, వారిలో 8,01,535 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటల సమయానికి 64.38 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

ఎన్నికల గణాంకాలు ఇలా.. జిల్లాలో మొత్తం 31 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా, మూడు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 28 స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. జెడ్పీటీసీ స్థానాలకు 93 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. అదేవిధంగా 450 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా, 97 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 353 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఎంపీటీసీ స్థానాలకు 785 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 1,463 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 536 సున్నితమైనవి కాగా, 508 అత్యంత సున్నితమైన కేంద్రాలుగా గుర్తించారు. 320 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ సదుపాయం కల్పించారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ... ఎన్నికల నిర్వహణ కోసం 28 మంది రిటర్నింగ్ అధికారులు, 28 మంది సహాయ రిటర్నింగ్ అధికారులు, 1,913 మంది ప్రిసైడింగ్ అధికారులు, 6,150 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. వీరితోపాటు 134 మంది జోనల్ అధికారులు, 496 మంది సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం 1,947 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. మొత్తంగా చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

గోరంట్ల, సోమందేపల్లిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన
అడిషనల్ ఎస్పీ అంకిత సురానా

గోరంట్ల / సోమందేపల్లి , అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో గురువారం గోరంట్ల, సోమందేపల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అడిషనల్ ఎస్పీ అంకిత సురానా సందర్శించి పోలింగ్ సరళిని, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి స్పష్టం చేశారు.



మందలపల్లి, గోరంట్ల, కప్పలబండలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్





మందలపల్లి/గోరంట్ల, నవంబరు 05, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మందలపల్లి, గోరంట్ల, కప్పలబండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలు, ఎన్నికల సిబ్బందికి అందుబాటులో ఉన్న వసతులు, పోలింగ్ నిర్వహణకు చేసిన ముందస్తు ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓటర్లు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా సజావుగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని సదుపాయాలు సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఓటర్ల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియలో ప్రతి అంశాన్ని నిశితంగా పర్యవేక్షించాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

ముదిగుబ్బలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన....

జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ముదిగుబ్బ, నవంబరు 05, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ముదిగుబ్బ మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలు, తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, ఓటర్లు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలను ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణలో విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. సమస్యాత్మక పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల తనిఖీ ద్వారా ఎన్నికల ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు.



ఆరు మండలాల్లో పటిష్ఠ పోలీసు బందోబస్తు..

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

- డీఎస్పీ మాణిక్యరావు పర్యవేక్షణలో సమర్థవంతమైన భద్రత

పుట్టపర్తి, నవంబరు 5, అమరావతి వెలుగు : పుట్టపర్తి పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో చెదురుమదురు సంఘటనలు మినహా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఎస్పీ ఎన్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పుట్టపర్తి సబ్ డివిజనల్ పోలీసు అధికారి సి. మాణిక్యరావు స్వయంగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ పోలీసు బలగాలను అప్రమత్తం చేశారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు క్షేత్రస్థాయిలో పోలీసు యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ముందస్తుగా పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రతా చర్యలు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా అక్కడక్కడ చోటుచేసుకున్న చెదురుమదురు సంఘటనలను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకువచ్చారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల పోలీసు అధికారులతో డీఎస్పీ మాణిక్యరావు నిరంతరం సమన్వయం చేసుకుంటూ బందోబస్తు నిర్వహణను పర్యవేక్షించారు. ఎస్పీ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ ఎన్నికల భద్రతలో డీఎస్పీ మాణిక్యరావు చూపిన పర్యవేక్షణ, పోలీసు సిబ్బందిని సమన్వయం చేసిన తీరు స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రజాస్వామ్య పండుగైన ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసు యంత్రాంగం చేపట్టిన భద్రతా చర్యలు ప్రశంసలు అందుకున్నాయి. మొత్తంగా ఆరు మండలాల్లో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో పోలీసు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.





కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ సరళిని

పరిశీలించిన డీఆర్వో కొండయ్య

పుట్టపర్తి, నవంబరు5, అమరావతి వెలుగు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య సందర్శించి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల్లో కొనసాగుతున్న పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ శాతం, ఓటర్ల హాజరు, పోలింగ్ నిర్వహణ తీరును సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల సిబ్బంది నుంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ పోలింగ్ సరళిని పర్యవేక్షించాలని కంట్రోల్ రూమ్ సిబ్బందికి సూచించారు. ఎక్కడైనా సమస్యలు లేదా ఇబ్బందులు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని మండలాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ ముగిసే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని డీఆర్వో సూచించారు.



జర్నలిస్టులపై పోలీసుల దౌర్జన్యం

ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు

పుట్టపర్తి, నవంబరు 5, అమరావతి వెలుగు : ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసులు వార్తా సేకరణకు వెళ్లిన జర్నలిస్టులపై దాడులకు యత్నించడం, దురుసుగా ప్రవర్తించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలిపెట్టువంటిదని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి షబ్బీర్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చలపతి తీవ్రంగా ఖండించారు. చిత్తూరు జిల్లా వీకోటలో ఎన్టీవీ విలేకరి అక్రమ్‌పై, శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి, సీనియర్ జర్నలిస్టు బాబ్జాన్‌పై, చిలమత్తూరులో సాక్షి విలేకరిపై పోలీసులు వ్యవహరించిన తీరును వారు తప్పుబట్టారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుల పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసు అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లా వీకోటలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల వార్తల సేకరణకు వెళ్లిన ఎన్టీవీ విలేకరి అక్రమ్‌పై సీఐ స్థాయి అధికారి దాడికి యత్నించడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని విమర్శించారు. తాము ఓటు వేసేందుకు వెళుతున్నామని చెప్పినా వినకుండా జర్నలిస్టుపై దాడికి ప్రయత్నించడం ఏమిటని ప్రశ్నించారు. శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద చోటుచేసుకున్న ఘటనలను చిత్రీకరిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి, సీనియర్ జర్నలిస్టు బాబ్జాన్ పట్ల స్థానిక సీఐ దురుసుగా ప్రవర్తించడం గర్హనీయమన్నారు. ఓటర్లకు ఇబ్బంది కలగకుండా, పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లకుండా బయట నుంచే ఘటనలను చిత్రీకరిస్తున్న బాబ్జాన్‌ను మొదట బయటకు వెళ్లాలని ఆదేశించి నెట్టివేశారని ఆరోపించారు. చిత్రీకరణ పూర్తి చేసుకుని వెళ్లిపోతానని చెప్పినా వినకుండా దౌర్జన్యానికి దిగారని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుతో పాటు ఇతర గుర్తింపు కార్డులను చూపించినప్పటికీ వాటిని లాక్కొని బెదిరింపులకు పాల్పడ్డారని, కొట్టడానికి వచ్చినట్లు వ్యవహరించి, బయటకు వెళ్లకపోతే అంతు చూస్తానని హెచ్చరించినట్లు తెలిపారు. చివరకు గుర్తింపు కార్డును జేబులో పెట్టి పక్కకు తోసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా చిలమత్తూరు మండల కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు స్టేషన్‌లో నిర్బంధించారన్న సమాచారం తెలుసుకున్న సాక్షి విలేకరి వార్తా సేకరణ కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా, అక్కడ విధుల్లో ఉన్న డీఎస్పీ నిర్లక్ష్యంగా మాట్లాడటంతో పాటు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం సమంజసం కాదన్నారు. వృత్తిపరమైన బాధ్యతలో భాగంగా సమాచారం సేకరించేందుకు వెళ్లిన విలేకరులను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు.

వెంటనే చర్యలు తీసుకోవాలి... ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద చోటుచేసుకునే పరిణామాలను ప్రజలకు తెలియజేయడం మీడియా బాధ్యత అని, ఆ విధుల్లో ఉన్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందని వారు స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద చోటుచేసుకున్న ఘటనలను నియంత్రించాల్సిన అధికారులు, వాటిని చిత్రీకరిస్తున్న విలేకరులపై ఆగ్రహం వ్యక్తం చేయడం విచారకరమన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా స్వేచ్ఛను, జర్నలిస్టుల వృత్తిపరమైన బాధ్యతలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. వీకోట, నల్లమాడ, చిలమత్తూరులో జరిగిన మూడు ఘటనలపై పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల పట్ల దురుసుగా ప్రవర్తించిన సంబంధిత సీఐలు, డీఎస్పీపై తగిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. జర్నలిస్టులపై దౌర్జన్యాలకు పాల్పడే అధికారుల విషయంలో ఫెడరేషన్ ఉపేక్షించబోదని హెచ్చరించారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి షబ్బీర్, బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చలపతి స్పష్టం చేశారు.

బ్యాలెట్ బాక్సుల భద్రతపై జాయింట్ కలెక్టర్

విష్ణుచరణ్ పరిశీలన

అనంతపురం, నవంబరు 05, అమరావతి వెలుగు : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో బ్యాలెట్ బాక్సుల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అనంతపురం నగరంలోని జేఎన్‌టీయూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ గురువారం పరిశీలించారు. వివిధ పోలింగ్ కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బంది తరలిస్తున్న బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూములకు చేరుకున్న తీరును సమీక్షించారు. ఇప్పటివరకు ఎన్ని బ్యాలెట్ బాక్సులు చేరుకున్నాయి, ఇంకా ఎన్ని రావాల్సి ఉంది అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ బాక్సుల స్వీకరణ, భద్రపరిచే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని అధికారులను ఆదేశించారు. నిరంతర నిఘా కొనసాగించాలని, భద్రతా విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం బ్యాలెట్ బాక్సులను భద్రపరిచి, సంబంధిత ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ ప్రేమంత కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల పోలింగ్

కొత్తచెరువు, నవంబరు 5, అమరావతి వెలుగు : మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఉదయం ప్రారంభమైన పోలింగ్‌లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరి కనిపించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అధికారులు పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్ల గుర్తింపు కార్డులను ఎన్నికల సిబ్బంది పరిశీలించి ఓటు వేసేందుకు అనుమతించారు. మహిళలు, పురుషులు, వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలివచ్చారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో నిరంతరం నిఘా ఉంచి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. అధికారుల పర్యవేక్షణలో పోలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగి నిర్దేశిత సమయానికి ముగిసింది. దీంతో ఎన్నికల నిర్వహణలో మరో కీలక ఘట్టం ప్రశాంతంగా పూర్తయింది.








కంట్రోల్ రూమ్, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, నవంబరు 05, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తనిఖీ చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన నియంత్రణ కేంద్రంలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలించారు. వివిధ మండలాల్లోని పోలింగ్ కేంద్రాల నుంచి అందుతున్న వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ, ఓటర్ల రాకపోకలు, పోలింగ్ నిర్వహణ తీరును గమనించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సిబ్బందికి సూచించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు నిరంతర నిఘా కొనసాగించాలని, ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.





ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలి

పుట్టపర్తి, నవంబరు 5, అమరావతి వెలుగు : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు పుట్టపర్తిలోని రెవెన్యూ భవన్, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం సమీపంలో ప్లాస్టిక్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, నిల్వ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంటైనర్లను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ప్రజలకు ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, నీరు, గాలి కాలుష్యానికి కారణమవుతున్నాయని, వాటి విచ్చలవిడి వినియోగం పర్యావరణ సమతుల్యతకు ముప్పుగా మారుతోందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా వస్త్ర సంచులను ఉపయోగించాలని, ఒక్కసారి ఉపయోగించి పారవేసే ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలని అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా నిర్దేశించిన ప్రత్యేక కంటైనర్లలోనే వేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ శశికళ, మండలి సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.









Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576